ఖమ్మం రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం, అక్టోబర్ 21 : ఖమ్మం రైల్వేస్టేషన్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తానని, కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన రైల్వేస్టేషన్‌ను సందర్శించి నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్, ఎలివేటర్, ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలు, లోటుపాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ముస్తఫా, నరేందర్, అనంతరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

ముత్తయ్య కుటుంబానికి పరామర్శ

తిరుమలాయపాలెం, అక్టోబర్ 21 : మండలంలోని జల్లేపల్లిలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు రేఖ ముత్తయ్య కుటుంబాన్ని సోమవారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట చావా శివరామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్, పోట్ల కిరణ్, సైదులు, వేణు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలపై అవగాహన

కొణిజర్ల, అక్టోబర్ 21: కొణిజర్ల ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం ఎంపీడీవో రోజారాణి అధ్యక్షతన ఐకేపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి బాలాజీ మాట్లాడుతూ.. రైతులకు ఎక్కడా ఇబ్బంది రాకుండా ఉండాలని, కలెక్టర్ మొత్తం 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించారన్నారు. కొణిజర్లలో 14 సెంటర్లలో 11 సెంటర్లు ఐకేపీ వారికి ఇచ్చారని, రెండు సెంటర్లు పీఏసీఎస్ సొసైటీ వారికి, ఒకటి డీసీఎంఎస్ ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో తహసీల్దార్ తఫజ్జుల్‌హుస్సేన్, ఎంఈవో అబ్రహం, ఐకేపీ సెంటర్ల ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

చింతకాని, అక్టోబర్ 21: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంపీడీవో రెబెల్లి రామయ్య అన్నారు. చింతకాని ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు మెరుగవ్వాలని, ఈ నెలాఖరు లోపు చేపట్టిన యుద్ధప్రాతిపదికన చేపట్టిన పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలలకు 2వ విడత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు వచ్చాయని తెలిపారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

చింతకాని, అక్టోబర్ 21: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో వీరపనేని శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో పురోగతి, ఎఫ్ఎల్ఎన్ అమలు విధానాన్ని, పలు రికార్డులను పరిశీలించారు.

రైతుభరోసా నిధులను విడుదల చేయాలి

చింతకాని, అక్టోబర్ 21 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన 6 హామీలను తక్షణమే అమలు చేయాలని, వానకాలం రైతుభరోసా నిధులను సైతం విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అన్నారు. చింతకాని మండల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కార్యకర్తలు, నాయకులు, రైతులు పాదయాత్ర చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు.

జాతీయ అవార్డు రావడం కోసం సహకరించాలి

బోనకల్లు, అక్టోబర్ 21: జాతీయ అవార్డు రావడం కోసం ప్రజలు సహకరించాలని ఎంపీడీవో ఆర్.రమాదేవి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో జాతీయ అవార్డు ఎంపిక కోసం గ్రామస్తుల సహకారం అందించాలని కోరుతూ గ్రామసభ నిర్వహించారు.

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్ : ఇద్దరి మృతి

కొణిజర్ల, అక్టోబర్ 21 : వర్షంలో దారి సరిగా కనిపించక ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఎన్ఎస్పీ కెనాల్‌లో పల్టీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని బోడియాతండా సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, మృతుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరాలోని శాంతినగర్‌కు చెందిన బానోత్ భీమ్‌దేవ్(45), భూక్యా సైదులు(50) ట్రాక్టర్‌పై రఘునాథపాలెం మండలం చింతగుర్తి వెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో బోడియాతండా సమీపంలోని ఎన్ఎస్పీ కెనాల్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి భారీగా వర్షం కురుస్తుండడంతో ఎదురుగా ఉన్న బ్రిడ్జి సరిగా కనిపించలేదు. దీంతో బ్రిడ్జికి ఆనుకొని ఉన్న సైడ్ వాల్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ ఎన్ఎస్పీ కెనాల్‌లో పల్టీ కొట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముందుగా ట్రాక్టర్ ఇంజిన్, తర్వాత ట్రాక్టర్ ట్రక్ కూడా కాలువలో పడిపోవడంతో అప్పటికే ఇంజిన్‌పై కూర్చొని ఉన్న ఇరువురు ట్రక్, ఇంజిన్ మధ్యలో పడిపోయారు. దీంతో భీమ్‌దేవ్‌కు తీవ్రగాయాలు కాగా, సైదులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. స్థానిక ఎస్సై సూరజ్ ఆధ్వర్యంలో ప్రొక్లెయినర్ సహాయంతో ట్రాక్టర్ ఇంజిన్‌ను బయటకు తీశారు. మృతదేహాలను గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీశారు. మృతుడు భీమ్‌దేవ్‌కు భార్య లక్ష్మి, కుమారుడు గోపి, కూతురు త్రిష ఉన్నారు. సైదులుకు భార్య అచ్చమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉమ, రేణుక, తిరుపతమ్మ ఉన్నారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరుగైన విద్య బోధనకు పటిష్ట చర్యలు

అధికారుల సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం/ మామిళ్లగూడెం, అక్టోబర్ 21: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు పటిష్టచర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్‌తో కలిసి బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ద్వారా కంప్యూటర్ విద్య అందడం చాలా సంతోషకరమన్నారు. కృష్ణ పాడిశెట్టి, మాధవి, మరియెన్, వంశీ పాల్గొన్నారు.

దిశ సమావేశానికి సిద్ధం కావాలి

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై మంగళవారం జరగనున్న జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి అధికారులు కచ్చితమైన నివేదికలతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆటోడ్రైవర్లకు తోడ్పాటు అందిస్తాం..

ఖమ్మం నగరంలోని ఆటోడ్రైవర్లు మెరుగైన జీవనం పొందేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆటో యూనియన్ నాయకులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 15న బస్టాండ్ కూడలి ప్రాంతంలో ఆటోడ్రైవర్లను కలెక్టర్ కలిసి వివరాలు తెలుసుకొని ఆటో యూనియన్ నాయకులను పిలిచి చర్చిస్తానని తెలిపిన విషయం విదితమే. ఈ మేరకు సోమవారం సమావేశమైన ఆటో యూనియన్ నాయకులు.. కలెక్టర్‌కు సమస్యలను వివరించారు. రూ.5లక్షల బీమా కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఏఐఎస్, సీసీఎస్ అధికారులతో సమావేశం

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలడని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్-2024 అధికారులు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థ ప్రత్యేక ఫౌండేషన్ కోర్స్‌లో భాగంగా జిల్లాలో క్షేత్ర పరిశీలనకు వచ్చిన సందర్భంగా వారితో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాకు వచ్చిన అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఈ నెల 21 నుంచి 28 వరకు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి ప్రజల స్థితిగతులు, ప్రభుత్వ సంస్థల పనితీరు, ప్రభుత్వ పథకాల లబ్ధి తదితర అంశాలను పరిశీలిస్తారని వివరించారు.

అమరుల త్యాగఫలమే దేశ ప్రగతి

శాంతి సమాజ స్థాపన కోసం అమరులైన పోలీసుల త్యాగాల ఫలితంగా దేశ ప్రగతికి బాటలు పడ్డాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఘనంగా నివాళి అర్పించింది. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిటీ ఆర్మ్‌డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో అమరవీరుల స్తూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసు అమరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ.. ఫ్లాగ్ డే సందర్భంగా అక్టోబర్ 25, 27 తేదీల్లో సైకిల్ ర్యాలీలు, 26న రక్తదాన శిబిరం, 27న పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు, 28న విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సర్టిఫికెట్ల పరిశీలన సక్రమమేనా?

పోస్టింగ్ సమయంలో గుర్తించిన అధికారులు
డీఎస్సీ-2024లో కొందరు అభ్యర్థులపై అందిన ఫిర్యాదులు
ఇంకెందరున్నారో విద్యాశాఖ తెలుస్తుందా?

సర్టిఫికెట్ల పరిశీలనను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 21 : డీఎస్సీ-2024లో ప్రక్రియలో భాగంగా కొందరు అభ్యర్థులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో 'సర్టిఫికెట్ల పరిశీలన' సక్రమంగా జరిగిందా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకెళ్తే.. డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, పీఈటీ, పీడీ, లాంగ్వేజ్ పండిట్ ఇలా పలు కేటగిరిల్లో ఖాళీలను భర్తీ చేశారు. ఒక్కో కేటగిరికి సంబంధించి ఆయా సబ్జెక్ట్‌లలో అర్హతలు కలిగిన అభ్యర్థులు మాత్రమే ఆ ఉద్యోగాలకు అర్హులు. ఊదాహరణకు.. స్కూల్ అసిస్టెంట్ హిందీ, లాంగ్వేజ్ పండిట్ హిందీ పోస్టులకు డిగ్రీలో సింగిల్ సబ్జెక్ట్ ఆప్షనల్ సబ్జెక్ట్స్ లేదా హిందీ స్పెషలైజేషన్ ఉండాలి. డిగ్రీ అనంతరం పీజీలో సైతం హిందీ సబ్జెక్ట్‌లో స్పెషలైజేషన్ కోర్సు పూర్తిచేయాలి. స్కూల్ అసిస్టెంట్‌లో గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్, తెలుగు ఇలా ప్రతి సబ్జెక్ట్‌కు ఎంపికయ్యే అభ్యర్థులు అందుకు సంబంధించిన కోర్సులు పూర్తిచేసిన వారు ఉద్యోగాలకు అర్హులు. వీరి సర్టిఫికెట్ల ఆధారంగా ఆయా సబ్జెక్ట్‌ల్లో ఉద్యోగాలు కల్పిస్తారు.

వెలుగుచూసిందిలా...

ఖమ్మం జిల్లాలో 520 పోస్టులకు వివిధ కేటగిరిల్లో డీఎస్సీ-2024లో అభ్యర్థులను ఎంపిక చేసి బస్సులు పెట్టి హైదరాబాద్ తీసుకువెళ్లి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నెల 15న జరిగిన కౌన్సిలింగ్‌లో మాత్రం 516 మందికి మాత్రమే నియామక పత్రాలు ఇవ్వగా ముగ్గురిని పెండింగ్‌లో ఉంచారు. ఒక్కొక్కరిది ఒక్కో కారణం కాగా.. విత్‌హెల్డ్‌లో పెట్టడం అనుమానాలకు తావిచ్చింది. ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే కొందరు అభ్యర్థులు జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకువెళ్లడంతో నియామకపత్రం ఆగిపోయినట్లు తెలుస్తున్నది. ఎంపికైన సబ్జెక్ట్‌లో సంబంధిత అభ్యర్థికి సర్టిఫికెట్ల వ్యత్యాసం ఉందని గుర్తించినట్లు విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి హైదరాబాద్ తీసుకువెళ్లి ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు.. నియామకపత్రం ఇచ్చేప్పుడు గుర్తించడంతో సర్టిఫికెట్ల పరిశీలనపై సందేహాలు వస్తున్నాయి. ఇంకెందరు ఇలా ఉన్నారో, వారిని గుర్తిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

త్రిసభ్య కమిటీకి నివేదిస్తాం..

హిందీ పండిట్ సబ్జెక్ట్ విషయంలో ఒక అభ్యర్థికి సంబంధించిన సర్టిఫికెట్లు సక్రమంగా లేవని తేలడంతో ఉద్యోగం ఇవ్వలేదు. విత్‌హెల్డ్‌లో పెట్టాం. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సీఈవో గల త్రిసభ్య కమిటీకి నివేదిస్తాం. దాని ఆధారంగా సర్టిఫికెట్ల పరిశీలన చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. అభ్యర్థులకు ఏమైనా గ్రీవెన్స్ ఉంటే జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

- ఈ. సోమశేఖరశర్మ, డీఈవో

కళ్ల ముందే వరి పంట నేలపాలు

నేలకొరిగిన వరిపంటను చూపుతున్న రైతు

పెనుబల్లి/ పెనుబల్లి (కల్లూరు)/జూలూరుపాడు/ దుమ్ముగూడెం, అక్టోబర్ 21: పండిన పంట చేతికొచ్చిందనుకునేలోపే కురిసిన వర్షం కళ్లముందే ఆ పంటను నేలపాలు చేసింది. దీంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని చంద్రుపట్ల, ఎర్రబోయినపల్లి, కొత్త లింగాల, కిష్టయ్యబంజర, గోపారం, కప్పలబంధంతో పలు గ్రామాల్లో వరి పంట ఏపుగా పెరిగి ఉంది. ఓ పది రోజుల్లో పంటను కోసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఒక్కసారిగా గాలి దుమారంతో కూడిన భారీ వర్షం రావడంతో పంటంటా నేల కొరిగింది. ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకుంటున్నారు. జూలూరుపాడు మండలంలోనూ భారీ వర్షం కురిసింది. అయితే, ఈ వర్షానికి పత్తి, మిర్చి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, ఇదే జిల్లా దుమ్ముగూడెం మండలంలోనూ వందల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెం, కోంద్రుపాడు, అడవిమల్లెల, కుప్పెనకుంట్ల గ్రామాల్లో కురిసిన వర్షానికి వరి పంట నేలవాలింది.

దేవాదాయ శాఖ పర్యవేక్షణలోనే ఆదాయ వ్యయాల నియంత్రణ

కారేపల్లి, అక్టోబర్ 21: ఉసిరికాయలపల్లి పంచాయతీ కోట మైసమ్మ ఆలయానికి సంబంధించి 2006లో 8 ఎకరాల 20 గుంటల భూమిని ఎండోమెంట్‌కు బదిలీ చేశామని, దేవాదాయ శాఖ పరిరక్షణలోని ఆదాయ వ్యయాల నియంత్రణ ఉంటుందని, తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఫౌండ్రీ ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభి రామారావు అన్నారు. కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఈవో పర్యవేక్షణలో జమ ఖర్చులు నిర్వహిస్తారన్నారు.

దసరా సందర్భంగా నిర్వహించే జాతర సోమవారంతో ముగిసింది. దీనికి సంబంధించిన రెండో దఫా హుండీలు, ఇతర ఆదాయాలను ఆలయ చైర్మన్ పర్సా రామారావు, దేవాలయ శాఖ కార్య నిర్వహణాధికారి వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా నాసరయ్య

రఘునాథపాలెం, అక్టోబర్ 21: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పసుపులేటి నాసరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామ శ్రీనివాస్ నియామకపత్రాన్ని అందజేశారు. తనను అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రామ శ్రీనివాస్, రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వస్త్ర వ్యాపారి దివాళ పిటిషన్ దాఖలు

ఖమ్మం లీగల్, అక్టోబర్ 21: మండలంలోని కోక్యతండాకు చెందిన పిల్లి శ్రీలక్ష్మి రూ.56లక్షలకు ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి కోర్టులో సోమవారం దివాళా పిటిషన్ దాఖలు చేశారు. శ్రీలక్ష్మి 7 సంవత్సరాలుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నది. వ్యాపార అభివృద్ధి కోసం బంధువులు, స్నేహితుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకున్నది. వ్యాపారంలో భారీ మొత్తంలో నష్టం రావడంతో దివాళా పిటిషన్ దాఖలు చేసినట్లు ఆమె తరపు న్యాయవాది పేర్కొన్నారు.

పీహెచ్‌సీకు బెడ్ వితరణ

పెనుబల్లి, అక్టోబర్ 21: మండలంలోని యడ్లబంజర గ్రామానికి చెందిన యడ్ల హర్షిత జన్మదినం సందర్భంగా తన తల్లి పద్మశ్రీ జ్ఞాపకార్థం లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.20 వేలు విలువైన బెడ్‌ను మెడికల్ ఆఫీసర్ చింతా కిరణ్‌కుమార్‌కు సోమవారం అందజేశారు.

విద్యార్థినులకు అభినందన

మధిర రూరల్, అక్టోబర్ 21: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన పాఠశాలల ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మాటూరు హైస్కూల్ విద్యార్థినులను ఎంఈవో ఓ వై.ప్రభాకర్ అభినందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన మేడిశెట్టి మహాలక్ష్మి, చిలువేరు జయశ్రీని అభినందిస్తూ జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

తిరుమలాయపాలెం, అక్టోబర్ 21 : మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

తిరుమలాయపాలెం, అక్టోబర్ 21: మండలంలోని సుబ్లేడు నుంచి గుండెపుడి వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ సుబ్లేడు మాజీ సర్పంచ్ మండడి ఇజ్రాయేల్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు సోమవారం ప్రజాపాలన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు.

పాత కాలువ పనుల పరిశీలన

కూసుమంచి, అక్టోబర్ 21 : పాలేరు రిజర్వాయర్ పరిధిలోని నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు సాగునీరు అందించే పాత కాలువను సోమవారం ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్ పరిశీలించారు. ఇటీవల వరదలతో సెప్టెంబర్ 1న గండ్లు పడిన ప్రాంతంలో పనులను ఎస్ఈ వెంకటేశ్వర్లు సీఈకి వివరించారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పెంచాలి

కూసుమంచి, అక్టోబర్ 21 : పాఠశాలలో విద్యార్థులు చదవడంతోపాటు పరీక్షలు రాయటం, మంచిమార్కులు రావడం వంటి వాటిపైన కాకుండా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచాలని ఏఎంవో కేశవపట్నం రవికుమార్ అన్నారు. కూసుమంచిలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న అసైన్‌మెంట్-1 పరీక్షలను పరిశీలించారు. కూసుమంచి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గోరీలపాడుతండా, పెరికసింగారం పాఠశాలలను తనిఖీ చేశారు.

ప్రారంభమైన ఫార్మా కౌన్సిలింగ్

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 21 : టీజీ ఎప్‌సెట్-2024 ద్వారా ఫార్మా డీ, బీ ఫార్మసీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు సోమవారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా తెలిపారు. మొదటిరోజు 448 మంది విద్యార్థులు వివిధ స్లాట్లలో నమోదు చేసుకున్నారని వెల్లడించారు.

రేషన్‌డీలర్ల సంఘం అడ్‌హక్ కమిటీ ఎన్నిక


అడ్‌హక్ కమిటీని సన్మానిస్తున్న నాయకులు

రఘునాథపాలెం, అక్టోబర్ 21: ఖమ్మం నగర రేషన్‌డీలర్ల ఐక్య సంక్షేమ సంఘం నూతన అడ్‌హక్ కమిటీ ఎన్నిక సోమవారం ఖమ్మంలో జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వాకదాని శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి ఉమారాణి రఫీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా గోళ్ల మురళి, మీడియా కన్వీనర్‌గా షేక్ లాల్‌జానీపాషా, సలహాదారుడిగా మోటమర్రి చంద్రశేఖర్‌రావును ఎన్నుకున్నారు. సభ్యులుగా లగిశెట్టి వెంకటేశ్వర్లు, రత్నాకరం సాయికృష్ణ, అనాసి హరిబాబు, ఉదారి రాధాకృష్ణ, జీజే శేఖర్‌బాబు, వీణాదేవి, వీరయ్యను నియమించారు.

బడిగ దీప్తికి ప్రశంసల వెల్లువ

దీప్తిని సన్మానిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 21: నిరుపేద కుటుంబానికి చెందిన బడిగ దీప్తి ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సొంతం చేసుకొని ప్రభుత్వ వైద్యశాలలో సీటు సంపాదించినందుకు పలువురు ప్రముఖులు ప్రశంసల జల్లు కురించారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'దీప్తి స్ఫూర్తి' అనే కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం నగరంలోని తన గృహంలో కార్పొరేటర్ తోట రామారావుతో కలిసి దీప్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదరికంలో పుట్టినప్పటికీ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడం సంతోషదాయకమన్నారు. దీప్తి చదువుకు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దీప్తి తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కార్పొరేటర్ మాటేటి అరుణానాగేశ్వరారావు తన నివాసంలో దీప్తిని సత్కరించారు. తనవంతు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు మాటేటి కిరణ్‌కుమార్, చిన్న మల్లేషం, ఎస్‌కే జానిమియా, మాటేటి రాకేష్, యాదగిరి, నరేష్, వెంకటేష్, నాగరాజు, డీ గోపాల్, నజీర్ పాల్గొన్నారు.

రాధమ్మ మృతికి కందాల సంతాపం

నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాల

ఖమ్మం రూరల్, అక్టోబర్ 21 : ఇటీవల మృతిచెందిన చల్లపల్లి రాధమ్మ మృతి పట్ల పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రం పెద్దతండా పంచాయతీ పరిధిలోని చల్లపల్లి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి శ్రీనివాస్ తల్లి రాధమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ జీ దర్గయ్య, సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, శ్రీనివాస్, మోహన్, వీరన్న, బాలూనాయక్, రమేష్, తరుణ్, ఉదయ్ ఉన్నారు.

రాజాకు ఎంపీ వద్దిరాజు పరామర్శ

ఖమ్మం, అక్టోబర్ 21: ఇటీవల తండ్రిని కోల్పోయిన తన ముఖ్య అనుచరుడు, ఖమ్మానికి చెందిన యువ నాయకుడు రాపర్తి రాజాను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం పరామర్శించారు. రాజా తండ్రి ప్రసాదరావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎంపీ రవిచంద్ర రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలోని రాజా నివాసానికి వెళ్లి ప్రసాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రసాదరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

ఎర్రుపాలెం, అక్టోబర్ 21: మండల పరిధిలోని బనిగండ్లపాడు బీసీకాలనీ పాఠశాలలో విద్యార్థులకు రెండో విడత ఏకరూప దుస్తులను సోమవారం మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, పెద్దగోపవరం సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, శివాలయం చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, అంకమ్మతల్లి ఆలయ పూజారి వేమిరెడ్డి వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గురునాథరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

ప్రజాధనాన్ని లూటీ చేయొద్దు

వైరాటౌన్, అక్టోబర్ 21: వైరా మున్సిపాలిటీలో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు ప్రయత్నాలు చేయడంపై సీపీఎం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపాలిటీలో అనేక రహదారులు, డ్రైనేజీ నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని, వాటిని పూర్తి చేయకుండా బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని ఏ విధంగా లూటీ చేస్తారని కమిషనర్ వేణును ప్రశ్నించారు. బొంతు రాంబాబు, మద్దెల రవి, సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు పాల్గొన్నారు.

24న ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

వేంసూరు, అక్టోబర్ 21: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 26 పంచాయతీల్లో 01/04/2023 నుంచి 31/03/2024 వరకు జరిగిన పనులపై ఈ నెల 24న మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ నివేదికలపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, మేట్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ఐఎన్‌టీయూసీ

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 21: పట్టణంలోని జవహర్‌నగర్ నుంచి సింగరేణి పీవీ. ఎన్‌కాలనీ కెనాల్ వద్ద రోడ్డు, తామరచెరువు నుంచి కాకర్లపల్లికు వెళ్లే దారి వరకు అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయికి కాలనీవాసులు, సింగరేణి కుటుంబసభ్యుల తరపున ఐఎన్‌టీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించండి

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 21: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభం కాగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ ఆదేశాల మేరకు ఎంఈవో రాజేశ్వరరావు మండలంలో అనేక చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయాల్లో మాత్రమే పరీక్షలు నిర్వహించాలని, టైంటేబుల్ పాటించాలని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 21: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీల్లో అండర్-17, 14 పోటీల్లో నగరంలోని సర్వజ్ఞ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారని డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్ తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ నీలిమ, ఉపాధ్యాయులు అభినందించారు.

హార్వెస్ట్ విద్యార్థుల సత్తా..

ఎస్‌జీఎఫ్ పోటీల్లో నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ తెలిపారు. అండర్-14, 17లో చెస్, బాస్కెట్‌బాల్‌లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

15వ బెటాలియన్‌లో అమరవీరుల దినోత్సవం

సత్తుపల్లి, అక్టోబర్ 21: మండల పరిధిలోని గంగారంలో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ పీ.జే.పీ.సీ.చటర్జీ విధి నిర్వహణలో అసువుల బాసిన అమరవీరులకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్మృతి, పరేడ్ ద్వారా పోలీసు అమరవీరులకు గౌరవవందనం సమర్పించారు.

ఎర్రుపాలెంలో 'శాతవాహన' నిలుపుదలకు హామీ

ఎర్రుపాలెం, అక్టోబర్ 21: ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లో శాతావాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రయాణికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి హనుమంతరావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన షన్‌రెడ్డి రైల్వే జీఎంకు లెటర్ రాయాలని తన పీఏకు ఆదేశాలిస్తూ జీఎంను తనతో మాట్లాడించాలని ఆదేశించారు.

మధిర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

మధిర, అక్టోబర్ 21: వైరా ఏసీపీ ఎ.రెహమాన్ సోమవారం మధిర పట్టణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో నిరంతరం ముందస్తు సమాచారాన్ని సేకరించడంతో పాటు, పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజ్, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

INDUSIND BANK LTD.
LIGHT COMMERCIAL VECHILE
1). TS28TA8400 M &M BOLERO CAMPER NEW ZX BS6 -2022
Cell:9963659398
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616